క్లుప్తంగా

చిన్నారుల పెద్ద మనసు



బియ్యం బస్తా అందజేస్తున్న చిన్నారులు

జన్నారం: కలం పట్టి రాయాల్సిన చేతులు స్నేహితుడికి సాయం అందించాయి. తమ స్నేహితుడి తండ్రి చనిపోగా బడిలో చదువు కుంటున్న ఆ చిన్నారులు చేయిచేయి కలిపి సాయం అందించి పెద్దమనస్సు చాటుకున్నారు. జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ సురేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుమారుడైన గుండ అరవింద్‌కు స్నేహితులు అండగా నిలిచారు. తిమ్మాపూర్ గ్రామంలో 6వ తరగతి చదువుతున్న అరవింద్ స్నేహితులు పెరుగు అఖిరనందన్, దర్శనాల మనోజ్‌కుమార్, సహస్ర, రాజేశ్వరి, దిలీప్, అంజీ కలిసి తమ వంతుగా సహకారం అందించాలని అనుకున్నారు. చేయిచేయి కలిపి స్నేహితుడికి 25కిలోల బియ్యం బస్తాను ఆదివారం అందజేశారు. చిన్నారుల పెద్ద మనస్సును గ్రామస్తులు అభినందించారు.

గ్రామీణ వైద్యుల నిరసన ర్యాలీ



నెన్నెలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు

నెన్నెల: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివారం గ్రామీణ అనుభవ వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇలాంటి సంఘటనలు పునరావృతం కా కుండా చూడాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు పురుషోత్తం, ప్రకాష్, నరేష్, రమేష్, సునీల్‌గౌడ్, మొండన్న పాల్గొన్నారు.

ఐక్యత కోసమే సంఘాలు ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న యాదవులు

భీమారం: యాదవులందరూ ఐక్యం అయ్యేందుకు సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు మెండె మల్లేశ్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని యాదవభవన్‌లో ఆదివారం యువజన సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

యువజన సంఘం కమిటీ ఏర్పాటు..

యాదవ యువజన సంఘం అధ్యక్షుడిగా పుట్ట రాజేందర్, ఉపాధ్యక్షుడిగా బోయిని మహేష్, గౌరవ అధ్యక్షుడిగా తువ్వ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బోయిని శ్రీనివాస్, కోశాధికారిగా వేల్పుల రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గొర్రెల ఫాం ప్రారంభం



ఫాంను ప్రారంభిస్తున్న స్టేట్‌బ్యాంక్ మేనేజర్

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామ సమీపంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకం కింద మంజూరైన గొర్రెలు, మేకల ఫాంను ఆదివారం స్టేట్‌బ్యాంక్ మేనేజర్ మహేశ్ ప్రారంభించారు. సబ్సిడీ పథకం కింద మంజూరైన ఈ పథకానికి స్టేట్‌బ్యాంక్ సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గొల్లపెల్లి రమేశ్, శుభాష్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాజీ ఎంపీపీ, నస్పూర్ మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్ బేర సత్యనారాయణపై అక్రమ కేసు పెట్టిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సత్యనారాయణపై అక్రమ కేసులను పెట్టడం వల్ల గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారని, అక్రమంగా కేసు పెట్టిన నస్పూర్ మున్సిపల్ కమిషనర్, సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

‘స్వచ్ఛత’పై పట్టింపేది..?



ఇళ్లను ఆనుకొని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిన ఈ చిత్రం బెల్లంపల్లి మున్సిపాలిటీ 15వ వార్డు టేకుల బస్తీలోనిది. ఇళ్ల చుట్టూరా పిచ్చి మొక్కలతో చిత్తడిగా తయారయ్యాయి. దోమ కాటుకు గురై ఆ వీధి ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. ఇప్పటికే కొంత మందికి జ్వరం వచ్చి తగ్గుముఖం పట్టగా, ఇంకా కొంతమంది మంచం పట్టారు. ‘స్వచ్ఛదనం పచ్చదనం’ ఈ వీధిలో కనిపించడం లేదు. ఈ తీరు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఈ ఫొటో 16వ వార్డుపరిధిలోని కాంట్రాక్టర్ బస్తీ లోనిది. తిలక్‌స్టేడియంను ఆనుకొని నిర్మించిన మురికి నీటి కాలువను సరిగ్గా శుభ్రం చేయడం లేదు. మురికి కాలువలో మల, మూత్రాలు, ఓ హోటల్ నుంచి వ్యర్థాలు వచ్చి చేరుతుండటం, ఆ మురికంతా రోజుల తరబడి స్థిరంగా నిలిచి ఉండి భరించలేనంతగా దుర్వాసన వస్తోంది. ఆ కాలువ పక్కన నివాసం ఉంటున్న ప్రజలు కంపు వాసనను భరించలేకపోతున్నారు. రోజువారీగా కాలువను శుభ్రం చేయాల్సి ఉన్నా, అశ్రద్ధ పెడుతుండటంతో ప్రజల బాధ వర్ణనాతీతంగా మారింది.



- ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగు
- వృద్ధి చెందుతున్న దోమలు
- కాలనీల్లో ఫాగింగ్‌పై దృష్టి సారించని అధికారులు
- నామమాత్రంగా ‘స్వచ్ఛదనం– పచ్చదనం’ చేపట్టారనే ఆరోపణలు



రాంనగర్ బస్తీలోని ఓ వీధిలో ఇళ్ల పరిసరాల్లో నిలిచిన వరద నీరు, పెరిగిన పిచ్చిమొక్కలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పరిసరాల పరిశుభ్రత కానరాకుండా పోయింది. ఇళ్ల పరిసరాల్లో, వీధుల్లో, రోడ్ల వెంట గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిత్తడి దృశ్యాలు కనిపిస్తున్నాయి. పూడిక నిండిన మురికి కాలువలు, నీటి మడుగులు, రొచ్చుగుంతలు బస్తీల్లో అధికంగా ఉంటున్నా కనీస చర్యలు కరువయ్యాయి. దోమల నివారణ చర్యలు మొక్కుబడిగా సాగుతుండటంతో మున్సిపాలిటీ వ్యాప్తంగా జ్వరాల తీవ్రత కనిపిస్తోంది. ప్రజల ఓట్లతో గెలుపొందిన మున్సిపల్ పాలకవర్గం పరిసరాల పరిశుభ్రతను గాలికొదిలేసి మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మొక్కుబడిగా ‘స్వచ్ఛదనం.. పచ్చదనం’..

వర్షాకాలంలో వ్యాధులు విజృంభించకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరుసగా ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమాన్ని అత్యంత చిత్తశుద్ధితో నిర్వహించాల్సి ఉండగా మొక్కుబడిగా చేపట్టి మమ అనిపించారనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా పూర్తిస్థాయిలో నిర్వహించలేదనేది జగమెరిగిన సత్యం. ఈ కార్యక్రమంలో చాలా మట్టుకు మున్సిపల్ కౌన్సిలర్లు, పుర ప్రజల భాగస్వామ్యం కనిపించ లేదు. శివారు వార్డుల పరిస్థితి మరీ దారుణం. అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదు. సుబ్బారావు పల్లి, పెద్దనపల్లి, కాల్‌టెక్స్ ఏరియా, గంగారం నగర్, గాంధీ నగర్, మధునన్న నగర్, కన్నాల బస్తీ, రవీందర్ నగర్, అంబేద్కర్ నగర్, షంషీర్‌నగర్, బెల్లంపల్లి బస్తీ, బాబుక్యాంపు బస్తీ, బూడిద గడ్డ బస్తీ, గోల్‌బంగ్లా బస్తీ, సుభాష్‌నగర్, రైల్వే అంబేద్కర్ నగర్, 65డీప్ ఏరియా, శాంతిఖని తదితర బస్తీల్లో పరిసరాల పరిశుభ్రతపై పట్టింపు లేకుండా వ్యవహరించడం సర్వ సాధారణ మైన విషయంగా మారింది.

ఫాగింగ్ లేదు..స్ప్రేయింగే

దోమల నివారణకు ఫాగింగ్ చేయించాల్సి ఉండగా శ్రద్ధ పెట్టడం లేదు. మున్సిపాలిటీ అవసరాల రీత్యా కొన్నాళ్ల క్రితం రెండు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేయగా, ప్రస్తుతం ఏ ఒక్కటి కూడా పనిచేయడం లేదు. మరమ్మతులకు వచ్చి మూలకు పడ్డాయి. వీటి గురించి పట్టించుకునే తీరిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులకు లేకుండా పోయింది. ఫాగింగ్ స్థానంలో స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. అదికూడా అన్ని వార్డుల్లో కొనసాగడం లేదు.

సమ ప్రాధాన్యత ఏదీ...!

పారిశుధ్యం పనుల నిర్వహణలో వివక్షత చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అన్ని వార్డుల్లోనూ సమంగా పారిశుధ్యం పనులు చేపట్టాల్సి ఉండగా, కొన్ని వార్డులకే పరిమితం చేస్తున్నారు. ఏ పనుల విషయంలోనైనా చైర్‌పర్సన్, మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకు ఇస్తున్న ప్రాధాన్యం మిగితా వార్డులకు ఇవ్వడం లేదనే విమర్శలు సహచర కౌన్సిలర్ల నుంచే వెల్లువెత్తుతున్నాయి. కొందరు కౌన్సిలర్లు పలుమార్లు చెప్పినా పట్టింపు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో వేగలేకపోతున్నాం



పిచ్చి మొక్కలు ఇళ్ల చుట్టూరా పెరిగి ఉండటంతో దోమలు సంతతి బాగా పెరిగింది. వర్షాకాలంలో ఇప్పటి దాక దోమల నివారణకు ఫాగింగ్ చేయించలేదు. కనీసం స్ప్రేయింగ్ కూడా చేయకపోవడంతో దోమలతో వేగలేకపోతున్నాం. నాకు నాలుగు రోజుల నుంచి జ్వరం కూడా వస్తోంది. కూలీ పని చేసుకునే బ్రతికే నాకు.. జ్వరం రావడంతో ఇళ్లు గడవడం కష్టంగా మారింది. ఇళ్ల చుట్టూరా ఉన్న చెట్ల పొదలను తొలగించి, దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలి. – యు.సన్నీ, టేకుల బస్తీ

వాసన తట్టుకోలేకపోతున్నాం



మా గోస ఎవలు సుత పట్టించుకుంటలేరు. మా ఇంటి ముందున్న మురికి కాలువల నుంచి తట్టుకోలేనంత మురుగు వాసన వస్తంది. ఆ వాసనకు అన్నం సుత తినబుద్ధి ఐత లేదు. దినాం మస్తు గోస పడ్తన్నం. మున్సిపాలిటోళ్లు ఎప్పటికప్పుడు కాలువను శుభ్రం చేయిస్తలేరు. గట్ల జేయబట్టి దోమలు పెరిగి జ్వరాలు వచ్చేటట్లు చేస్తన్నయ్. మా ఇంట్ల నా భార్యకు, నాకు జ్వరం వస్తంది. మురుగువాసన, దోమలతో మేము బతికేటట్లు లేదు. సార్లు ఇసారం జేసి పట్టించుకోవాలే.

– నరసింహాస్వామి, కాంట్రాక్టర్ బస్తీ

పారిశుధ్య పనులు చేపడుతున్నాం



మున్సిపాలిటీలో రోజువారీగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. అన్ని వార్డుల్లోనూ చెత్త సేకరణ చేపడుతున్నాం. కేవలం ఐదు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో ‘స్వచ్ఛదనం పచ్చదనం’ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయాం. అయినా కూడా వార్డుల్లో పారిశుధ్యం పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు మున్సిపాలిటీ వ్యాప్తంగా స్ప్రేయింగ్ జరుగుతోంది.

– కే.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

అలంకారప్రాయం.. ఎమ్మార్సీ భవనం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయంలో ఏర్పాటు చేసిన మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. టీఎస్‌ఈడబ్ల్యూడీసీ ద్వారా రూ.41లక్షల నిధులతో 2023 జూలైలో ఈ ఎమ్మార్సీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగ్గా దాదాపు నాలుగు నెలల క్రితం భవన నిర్మాణం పూర్తి జరిగింది. అప్పటి నుంచి ఈ భవనం వినియోగంలోకి రాకపోవడంతో నిరుపయోగకరంగా మారింది. ఫర్నీచర్, ఇతర సామగ్రి సమకూర్చకపోవడంతో కార్యకలాపాల నిర్వహణకు తావులేకుండా పోయింది. అయితే గత ప్రభుత్వం సూచించిన రంగును ఇతర రంగులోకి మార్చాలని అధికారులపై కొంత మంది ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఇక భవన ప్రారంభోత్సవంలో కూడా మండల విద్యాధికారి పోచయ్య కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరగా ప్రారంభించేలా చూడటంలో విఫలమయ్యారని పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. అయితే రాపల్లిలో ఎమ్మార్సీ భవనం ప్రారంభమైతే పట్టణ కేంద్రం నుంచి రోజూ వెళ్లిరావడం ఇబ్బందులకు గురి చేస్తుందని భావిస్తూ కూడా ప్రారంభించడానికి అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎమ్మెల్యే దృష్టికి వెళ్తేనే ఎమ్మార్సీ భవనం వినియోగంలోకి వస్తుందని పలువురు అంటున్నారు.

ఏఈవోకు వీడ్కోలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల రైతులకు దాదాపు 19ఏళ్లగా సేవలందించిన మండల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) కనకరాజు మందమర్రి ఏఈవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం హాజీపూర్ మండలం కర్ణమామిడి రైతువేదికలో ఏఈవో కనకరాజును పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడుతూ సత్కరించారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల పోలింగ్



చెన్నూర్: ఓటు వినియోగించుకున్న పద్మశాలీలు



మంచిర్యాలలో వినియోగించుకున్న పద్మశాలీలు

చెన్నూర్: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుల ఎన్నికల సందర్భంగా చెన్నూర్ పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఆదివారం పద్మశాలి కులస్తులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా బూర మల్లేశ్, వలకాటి రాజ్‌కుమార్ పోటీలో ఉన్నారు. చెన్నూర్ పోలింగ్ బూత్ పరిధిలో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాలకు చెందిన 470మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం 5గంటల వరకు 183మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి బండారి సతీశ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సరళిని గుండెటి యోగేశ్వర్, కామ రమేశ్, వెన్నం లక్ష్మీనారాయణలు జిల్లా ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. కార్యక్రమంలో నక్క లక్ష్మీనారాయణ, వెంగల పవన్‌కుమార్, వెంకటేశ్, గుండెటి మధులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఎన్నికలను జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలో 1700మంది పద్మశాలి ఓటర్లు ఉండగా, మంచిర్యాల పట్టణంలోనే 600మంది ఓటర్లు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బూర మల్లేశం రాట్నం గుర్తుతో, వల్లకాటి రాజకుమార్ మగ్గం గుర్తుతో పోటీచేస్తుండగా, వీరి ఇద్దరి మధ్యనే పోటీ నెలకొనగా జిల్లా ఎన్నికల పరిశీలకులుగా కామ రమేశ్, గుండేటి యోగేశ్వర్, వెన్నం లక్ష్మీ నారాయణలు వ్యవహరించారు.

అటెన్షన్ ప్లీజ్..



నడిరోడ్డుపై గుంతతో ఇక్కట్లు

భీమారం: భీమారం-ఆవిడం ప్రధాన రహదారిలో భీమారం ఎక్స్ రోడ్డు వద్ద గుంతతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్స్ రోడ్డు వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు దాదాపు ఐదు ఫీట్లు గుంత తవ్వారు. విగ్రహ ఏర్పాటును వాయిదా వేయడంతో గుంతని కొంతమేరకు పూడ్చివేశారు. అయితే పూర్తి స్థాయిలో మట్టినింపి బీటీ వేయకుండా వదిలిపెట్టడంతో వర్షాకాలం వరద నీరు అందులో చేరి ఇబ్బందిగా మారుతుందని వాహన చోధకులు పేర్కొన్నారు. వేగంగా వెళ్లే వాహన చోధకులకు దగ్గరకు వచ్చే వరకు కూడా గుంత ఏర్పడటం లేదని, దీంతో అందులో పడిపోయిన సంఘటనలు ఉన్నాయని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని గుంతని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన చోధకులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : భరత్, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్, చెన్నూర్ ఫోన్ నంబర్ : 9440819099

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి

- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



కోటపల్లి: వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ



కాసిపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

కోటపల్లి: మండలకేంద్రంలో ఆదివారం రోజున సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటపల్లి మండల మోకుదెబ్బ అధ్యక్షుడు ముత్యాల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ హాజరై సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలతో పాటు దళిత బహుజనుల సమాజానికి సేవ చేయాలన్నదే సర్దార్ పాపన్న గౌడ్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, శంకర్‌గౌడ్, అంజాగౌడ్, సత్యగౌడ్, మల్లయ్య, రాజం, వెంకటి,సంపత్ కందుల వెంకటేశ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిలో...

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు ఉపేందర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, కనుకయ్యగౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, రాజాగౌడ్, మురళిగౌడ్, ఆంజనేయులుగౌడ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులున్నారు.

దండేపల్లిలో...

దండేపల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని దండేపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద పాపన్నగౌడ్ చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ వీరత్వానికి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని, పలువురు నాయకులు పేర్కొన్నారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి రవిగౌడ్, పెరుమాండ్ల రవిగౌడ్, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, సుధాకర్, చిన్నగౌడ్, శంకర్‌గౌడ్, నారాయణగౌడ్, మల్లేష్‌గౌడ్, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో...

భీమారం: మండల కేంద్రంలో గీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు వేముల శ్రావణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పున్నంగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాసిపేటలో...

కాసిపేట: మండలంలోని కొండాపూర్ చౌరస్తాలో గౌడ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వాయిపాపన్నగౌడ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోకు దెబ్బ మండల సలహాదారు పల్లె మలయ్య, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు వెంకటేష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, నాయకులు రాజమౌళి, జేఏసీ కన్వీనర్ సిలోజు మురళి, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.



భీమారం: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



దండేపల్లి: పూలమాల వేస్తున్న రవిగౌడ్



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

తాండూర్: చిన్నతనంలో కలిసి చదువుకున్న ఓ స్నేహితుడు అనారోగ్యంతో అకాల మృతి చెందగా ఆ కుటుంబానికి సహచర స్నేహితులు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న గోలి మహేందర్ అనే స్నేహితుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మృతి చెందడంతో సహచర మిత్రులు ముందుకొచ్చి తోచిన రీతిలో విరాళాలు సేకరించారు. ఆ ప్రకారంగా వసూలైన రూ.30వేలు నగదు, 25కిలోల బియ్యం ఆదివారం స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.